క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, జిల్లా బస్‌స్టేషన్ రోడ్డు, అలంకార్ కూడలి, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీధరాచార్యులకు గురుబ్రహ్మ జాతీయ పురస్కారం



రామన్నపేట: ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ శ్రీధరాచార్యులకు జీసీఎస్ వల్లూరు ఫౌండేషన్, హైదరాబాద్ ప్రతినిధులు మంగళవారం గురుబ్రహ్మ జాతీయ స్థాయి పురస్కారంతో సన్మానించారు. ఈమేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి, సినీ హీరో సుమన్, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీసీఎస్ ప్రతినిధుల చేతుల మీదుగా శ్రీధరాచార్యులు పురస్కారాన్ని అందుకున్నారు. నగరంలోని పాపయ్యపేట చమన్‌కు చెందిన శ్రీధరాచార్యులు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, వ్యాఖ్యాతగా, గాయకులుగా, సామాజిక సేవకుడిగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

మీటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి



ఖిలా వరంగల్: విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ ఏఈ సంపత్‌కుమార్ సూచించారు. వరంగల్ 42వ డివిజన్ ఆర్టీఏ జంక్షన్ లెనిన్‌నగర్‌లో మంగళవారం పర్యటించి పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బోగి సురేష్, ప్రవీణ్, యాదగిరి, సూరావు విజయ్, పున్నం సుమన్, వల్లెపు దామోదర్, గోపాల్, మొగిలి, యాకయ్య, రుద్రచారి, సంపత్, అశోక్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఖిలా వరంగల్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఉర్సు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఉర్సు హరిజనవాడలో ఉర్సు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ల ఆధ్వర్యంలో చిన్నారులకు మంగళవారం ఆటపాటలతో విద్యను బోధించి, కథలు చెప్పారు. ముఖ్యఅతిథిగా హాజరై పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఆటపాటతో విద్యను అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో జమ, సుజాత, జ్యోతి, అమల, చిన్నారులు పాల్గొన్నారు.

మాధవికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: స్టడీస్ ఆన్ ఫార్మకోడైనమిక్ అండ్ ఫార్మకోకైనటిక్ ఇంటర్ యాక్షన్ ఆఫ్ సమ్ ఫైటోకెమికల్స్ విత్ సెలెక్టెడ్ యాంటీ డైయాబిటిక్ యాంటీ పిలెప్టిక్ అండ్ యాంటీ పవర్ లిపిడెమిక్ డ్రగ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కాకతీయ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగం పరిశోధకురాలు మాధవి మీసాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో మాధవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

25కిలోల లడ్డూ నివేదన



వరంగల్: కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ హనుమకొండ స్టోర్ మేనేజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో 25 కిలోల లడ్డూ, 60కిలోల పులిహోరను కాశిబుగ్గ వర్తక సంఘం వారికి అందజేశారు. దాంతో వారు స్వామికి నివేదించారు. వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండేటి కృష్ణమూర్తి, గుండేటి నరేంద్రకుమార్, వడిచర్ల సదానందం, గుల్లపల్లి రాజకుమార్, గోరంట్ల మనోహర్, కుసుమ నగేష్, వేముల నాగరాజు, సురేష్, కూరపాటి సతీష్, సంఘం కార్యవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

మామునూరు: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మామునూరు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో మామునూరు పోలీసులు, పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, చెడు వ్యసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మకు నివాళి

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం పాలనను ఎదిరించి విస్నూర్ రామచంద్రారెడ్డి గూండాలను తరిమికొట్టి, తన భూమితో పాటు పేదల భూములను రక్షించిన వీరనారి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్



న్యూశాయంపేటలో శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ కడియం కావ్య



పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



కేయూ గేట్ వద్ద నివాళులర్పిస్తున్న రజక విద్యార్థి సంఘం నాయకులు



హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



ఏసీరెడ్డినగర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా బాధ్యులు



హనుమకొండ రాయపురలోని చమన్‌లో..



మడికొండ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాజీపేట సిద్ధార్థనగర్‌లో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

హసన్‌పర్తి: అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎర్రగట్టు దేవస్థాన కల్యాణ మండపంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధితులను ఆదుకుంటున్నట్లు వివరించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల పెగడపల్లి సొసైటీ రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఈవిషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కార్పొరేటర్లు జక్కుల రజిత, పీఏసీఎస్ చైర్మన్లు రాజేష్, చల్లా గోపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షులు కిరణ్, గడ్డం శివరాం, ఆరెల్లి వెంకటస్వామి, టీఆర్‌కే రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మధు, జె.రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సట్టా స్థావరంపై దాడి

ఖిలా వరంగల్: రహస్యంగా ఆడుతున్న ఆన్‌లైన్ సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.4వేల నగదు, స్మార్ట్ మొబైల్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి ఉర్సు కరీమాబాద్ బొడ్రాయికి చెందిన గుజ్జరి కిరణ్ ఆన్‌లైన్ సట్టా ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు.

యజమాని ఇంట్లో పనిమనిషి చోరీ

వరంగల్ క్రైం: బాలసముద్రంలో ఓ ఇంటిలో వృద్ధులకు కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఆ ఇంట్లోనే చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం విశాఖపట్నం జిల్లా అనకపల్లి, విజయ రామారావుపేటకు చెందిన ఎల్లపు సాయికుమార్.. ఓ ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఈనెల 7న ఇంట్లో వృద్ధులు నిద్రిస్తున్న సమయంలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 4జతల బంగారం కమ్మలు, బంగారు గొలుసు, స్మార్ట్ ఫోన్, కీ ప్యాడ్ ఫోన్, కారు తాళంచెవి, డెబిట్ కార్డును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

సీకేఎం కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక



ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 10వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నాల్ రామదురై ఆదేశాల మేరకు ఎన్‌సీసీ ప్రవేశాల ఎంపిక ప్రక్రియను మంగళవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్‌రావు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం మెరుగుపడి చదువు మీద ధ్యాస పెడతారని అన్నారు. ఎన్‌సీసీలో బీ, సీ సర్టిఫికెట్లతో బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఏఆర్, ఎన్ఎస్‌జీ, ఎస్ఎస్‌బీ ఉద్యోగాలకు నిర్వహించే పరీక్షల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియలో 100 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 42 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి, లైబ్రరీ అనిల్, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పదో బెటాలియన్ బీహెచ్ఎం ప్రదీప్ మానే, హవల్దార్‌లు భాష, డీజీ.కుమార్, సీనియర్ క్యాడెట్లు సూర్య, ఉదయ్, నిహిత్, సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు చెరువు వద్ద ఏర్పాట్లు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ఉర్సు చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల తొలగింపు పనులను జేసీబీ యంత్రంతో చేపడుతున్నారు. చెరువులోని గుర్రపు డెక్కను కూలీలు తొలగిస్తున్నారు.

శ్వేతార్కుడికి ప్రత్యేక అలంకరణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో భక్తులు మంగళవారం లక్ష గరిక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గరికలతో శ్వేతార్కుడిని అర్చకులు అభిషేకించారు. జేష్టాదేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన చేశారు. పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, దేవులపల్లి సదానందం, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, స్థానికులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట

వరంగల్: వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయని, వాటిని పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల శరత్ కోరారు. ఈమేరకు వరంగల్ ఏబీసీడబ్ల్యూఓ శంకరయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నూతన భవనాలు నిర్మించాలని, మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని సూచించారు. అధికారుల అండదండలతో వరంగల్ జిల్లాలోని బీసీ హాస్టల్ వార్డెన్లు, వర్కర్లు తమ విధులకు హాజరుకాకుండా బినామీలను పెట్టుకొని జీతాలు తీసుకుంటూ ఇతర పనులు చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికారు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి విధులకు హాజరుకాని, సమయపాలన పాటించని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆ రెండు జీఓలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సోల్తి కిరణ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వం తీసుకొచ్చిన 11, 141 జీఓలను రద్దు చేయాలని కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పార్ట్‌టైం లెక్చరర్ల విషయంలో ఎస్ఎఫ్‌సీ, రెగ్యులర్ కోర్సులనే తారతమ్యాలు సృష్టించి 2018లో 11వ నంబర్, తరువాత 141వ నంబర్ జీఓను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఫుల్ వర్క్‌లోడుతో పనిచేస్తున్న 146మంది పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ కేయూ జనరల్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

వరంగల్: ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంచినట్లు వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు నిర్దేశించిన గడువు ప్రకారం అడ్మిషన్లు ఈ నెల 7వ తేదీతో ముగిశాయని పేర్కొన్నారు. కానీ, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు గడువు తేదీ ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు.

ఇందిరానగర్‌గా నామకరణం

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్‌లోని ఇందిరాగాంధీ బొమ్మ ఉన్న వీధికి ఇందిరానగర్ వీధిగా నామకరణం చేసి శ్రీవిఘ్నేశ్వర సహకార పరపతి సంఘం, యూత్ ఆధ్వర్యంలో మంగళవారం బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబి సాంబరాజు, దాసరి రాజేష్, కూచన రవీందర్, మామిడాల సతీష్, సంఘం అధ్యక్షులు వంగరి జయప్రకాష్, దాసి శివకృష్ణ, రామ సతీష్‌కుమార్, ఓరుగంటి రాజేందర్, కొక్కొండ వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

హన్మకొండ కల్చరల్: వరంగల్‌కు చెందిన సాంఘిక నాటకాల కళాకారుడు, వివిధ నాటక సంస్థల బాధ్యుడు ఆకుతోట లక్ష్మణ్‌ను విజయ టవర్ వ్యాపారస్తులు మంగళవారం సన్మానించారు. వరంగల్ జిల్లా నాటక సమాజాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట లక్ష్మణ్ ఎన్నికైన సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కొడం ప్రభాకర్, ఎనుముల ప్రసాద్, గట్టు మహేష్, చల్ల రమేష్, రుద్రాక్ష కుమార్, సముద్రాల లక్ష్మీనారాయణ, ఆకుతోట అనుదీప్, వంశీ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి..

న్యూశాయంపేట: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, గురుపూజోత్సవం సందర్భంగా వాసవి ఇంటర్ నేషనల్ క్లబ్, వరంగల్ ఆధ్వర్యంలో కొందమందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఈమేరకు వరంగల్ మట్టెవాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కోట ఉమేష్‌ను క్లబ్ బాధ్యులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి పి.వీరన్న, వైస్ గవర్నర్ సత్యనారాయణరావు, వెంకట్ నారాయణ, వాసుదేవులు, సుధాకర్, ఈశ్వర్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మెట్ల బావి అభివృద్ధి పనులు

ఖిలా వరంగల్: కాకతీయులు నిర్మించిన అద్భుతమైన మెట్ల బావి (రాణి రుద్రమదేవి స్నానాల బావి) అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బావిని హైదరాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులతో కలిసి బల్దియా డీఈ రాజ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను పరిశీలించారు. సాంకేతికతను ఉపయోగించి అభివృద్ధి పనులు చేపడుతునట్లు సాంకేతిక నిపుణులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుమారస్వామి, అంజయ్య, బిల్ల రాజు పాల్గొన్నారు.



మెట్ల బావి పనులను పరిశీలిస్తున్న డీఈ రాజ్‌కుమార్, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి

వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం

ఖిలా వరంగల్: బీజేపీని బలోపేతం చేసి వికసిత్ భారత్‌ను నిర్మిద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. వరంగల్ శివనగర్‌లో 34వ డివిజన్ 170వ బూత్ అధ్యక్షురాలు మార్తా ఉషారాణి ఆధ్వర్యంలో సభ్యుత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రతిఒక్కరు ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.



‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న హైమావతి

హసన్‌పర్తి: సఖి కేంద్రం అందిస్తున్న సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సఖి కేంద్రం అడ్మిన్ పి.హైమావతి సూచించారు. ఎర్రగట్టు క్రాస్‌లోని శివాని జూనియర్ కళాశాలలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురవుతున్న వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా గృహ హింస చట్టం గురించి వివరించారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్, వైద్యం, తాత్కాలిక వసతితో పాటు పోలీస్, న్యాయ సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. కేస్ వర్కర్ హరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నయీంనగర్: మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్, కేస్ వర్కర్ వినీల, ఆర్పీ కల్పన సూచించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్‌సింగారంలో మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల రక్షణ కోసం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అసాల్ట్ యాక్ట్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం ఉందని వివరించారు. ఆపదలో ఉన్నప్పుడు బాధిత మహిళలు, బాలికలు 181, 0870 2452112 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాల్లో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.నిర్మలను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా 3, 5వ తరగతుల్లో లక్కీ డ్రా ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు అడ్మిషన్లు కల్పించారని తెలిపారు. ఆ విద్యార్థులకు గత రెండేళ్లుగా నిధులు రాకపోవడాన్ని వారు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నిర్మలకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు కావడం లేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 81మంది నాన్ టీచింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. పదేళ్ల సర్వీస్ దాటిన వారిని టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని ఉద్యోగుల సమస్యలను అధ్యయనం చేయడం కోసం ఈనెల 11నుంచి మూడురోజుల పాటు సీఐటీయూ ఆధ్వర్యంలో విభాగాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టు రవి, ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, బాధ్యులు ఆకుతోట రాంచందర్, కచ్చకాయల చిరంజీవి, పల్లం రాజు, సంఘాల రాజు, సందీప్, రాజేందర్, కృష్ణ, శోభ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

రామన్నపేట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనిపెట్టి 14మంది బాధితులకు మంగళవారం అప్పగించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి తెలిపారు. గతంలోనూ 150 పైగా మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే వెంటనే మీసేవలో చలాన్ కట్టి రశీదుతో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్

డబ్బుల విషయంలో దంపతుల మధ్య గొడవ

గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన భర్త

మడికొండ: డబ్బుల విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మడికొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాజీపేట మండలం మడికొండకు చెందిన రాయికంటి మొగిలి(65) డబ్బుల విషయంలో మంగళవారం ఉదయం తన భార్యతో గొడవ పడ్డాడు. గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.



మొగిలి (ఫైల్)